క్లుప్తంగా

సింగరేణి నిధులతో రహదారి నిర్మించాలి


మాట్లాడుతున్న సురేశ్‌నాయక్

టేకులపల్లి: మండల కేంద్రం నుంచి కోయ గూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ వరకు సింగరేణి నిధులతో వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సేవాలాల్ ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సింగరేణి యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో లావుడ్యా వెంకటేశ్, బానోత్ నాగరాజు, బాదావత్ సురేశ్, జర్పుల లాలు, బోడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ ఫ్యాన్ వితరణ

టేకులపల్లి: మండలంలోని గోలియాతండా అంగన్వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన భూక్యా సురేశ్, సోనియా దంపతులు సోమవారం టేబుల్ ఫ్యాన్ వితరణగా అందజేశారు. అంగన్వాడీ టీచర్ ఇందిర, ఆయా వి.చాంది దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి అధికారులతో సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం రీజియన్‌లో విధులకు గైర్హాజరవుతున్న సింగరేణి ఉద్యోగుల విషయమై సోమవారం వీసీ ద్వారా డైరెక్టర్ (పా) వెంకటేశ్వరరెడ్డి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 75 మస్టర్ల కంటే తక్కువ ఉండి విధులకు హాజరు కానీ ఉద్యోగులు మొత్తం 202 మంది ఉన్నట్లు గుర్తించి, వారు విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

రబీ వరి విత్తనాలకు ప్రతిపాదనలు

పాల్వంచరూరల్: ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున రబీ సీజన్‌లో సాగుచేసేందుకు వరి విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామని ఏఓ శంకర్ సోమవారం తెలిపారు. వంద క్వింటాళ్ల బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్ విత్తనాలు పది రోజుల్లోగా అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు.

టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్‌కు సన్మానం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ అధికారి కార్యాలయంలో టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌ను టీఎన్‌జీఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, కొండగల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటరెడ్డిపై కొంత మంది రైతుల పేరిట జరిగిన దాడిని ఖండిస్తూ నల్లబ్యాడ్జిలు ధరించి ర్యాలీ నిర్వహించారు. మంగళవారం నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించారు. కార్యక్రమాల్లో రామారావు, భార్గవ్ చైతన్య, వెంకటపుల్లయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు గీతా పారాయణం

ఇల్లెందు: ఇల్లెందులపాడులోని గురు గీతా ఆశ్రమంలో శ్రీమత్ రాజాధిరాజ అచలరుషి శ్రీభగవత కృష్ణదేశీ కేంద్ర ప్రభువుల వార్షిక ఆరాధన పాదుకపూజ మహోత్సవం సందర్భంగా గురు గీతా పారాయణం ఘనంగా జరిగింది. సోమవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కటకం పద్మావతి, వారా రవి, ప్రభునాథ్, కొడారి రాజేందర్ పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అచలానంద దుర్గాప్రసాద్ రాజయోగి, మౌర్య రాంకుమార్, నెహ్రూ రాజయోగి, నిర్మలానంద మహబూబ్ అలీ, దరపల్లి వజ్రమ్మ, దండు బాలయ్య, గోపాల్ సాహూ, కొప్పుల రాధ, అన్నపూర్ణానంద స్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం కొన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం ఏడీఈ హేమచంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గంగబిషన్‌బస్తీ, ప్యూన్‌బస్తీ, ఎ-పవర్‌హౌస్‌బస్తీ, దో నంబర్‌బస్తీ, ఎస్‌సీబీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీజీఎస్ జిల్లా జాయింట్ కార్యదర్శిగా రాంచందర్

టేకులపల్లి: మండలానికి చెందిన సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రాంచందర్‌నాయక్ తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. పాల్వంచ సీపీఐ కార్యాలయంలో జరిగిన టీజీఎస్ జిల్లా మూడో మహాసభలో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉపయోగపడని భవనాలు

- ఇరవై ఏళ్లుగా సా..గుతున్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
- కొంతమేర నిధులు కేటాయిస్తే అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఎవరికీ పట్టని ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల దుస్థితి


నిర్మాణం పూర్తయినప్పటికీ అందుబాటులోకి రాని కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్

ఇల్లెందురూరల్: అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనం ఫలితంగా భారీ వ్యయంతో నిర్మించిన భవనాలు సుమారు ఇరవై ఏళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొద్దిపాటి నిధులు ఖర్చు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్న ఆయా భవనాల దుస్థితి ఎవరికీ పట్టడం లేదు. నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా అరణ్యరోదనగానే మిగిలిపోతోంది.

ఎస్సీ కార్పొరేషన్‌తో అంకురార్పణ

ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రెండు గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని ఎస్సీ కార్పొరేషన్ నిర్ణయించింది. 2005లో సుభాష్‌నగర్, కొమ్ముగూడెం గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.5 లక్షల వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించింది. కానీ భవనం ఒక రూపం వరకు రావడానికి మాత్రమే కేటాయించిన నిధులు పూర్తయ్యాయి. మళ్లీ కార్పొరేషన్ నుంచి నిధుల మంజూరు లేకపోవడంతో సుమారు 16 ఏళ్ల పాటు నిర్మాణాల్లో పురోగతి లేకుండా పోయింది.

2020లో సీడీఎఫ్ నిధులతో..

సుదీర్ఘకాలంగా పడావుపడిన ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేయాలని నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు పలువురు నాయకులు విన్నవించారు. స్పందించిన ఆమె సుభాష్‌నగర్, కొమ్ముగూడెంలలో ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నియోజకవర్గ అభివృద్ధి నిధి (సీడీఎఫ్) నుంచి రూ.10 లక్షలు చొప్పున రెండింటికీ కలిపి రూ.20 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో కొమ్ముగూడెంలో కమ్యూనిటీహాల్ భవన నిర్మాణం పూర్తి చేశారు. సుభాష్‌నగర్‌లో మాత్రం కేటాయించిన రూ.10 లక్షలు సరిపోకపోవడంతో నేటికీ నిర్మాణం అసంపూర్తిగానే ఉండిపోయింది. ఇదిలా ఉండగా కొమ్ముగూడెంలో పూర్తయిన భవనాన్ని 2022 జనవరి 3వ తేదీన అప్పటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించారు. కానీ విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో నేటికీ ప్రారంభించిన భవనం కూడా నిరుపయోగంగా ఉండిపోయింది.

గ్రామపంచాయతీలకు అప్పగించినా..

నియోజకవర్గ అభివృద్ధి నిధులతో ఒక రూపం వచ్చిన సుభాష్‌నగర్, కొమ్ముగూడెం ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్వహణ బాధ్యతలను నాటి ఉన్నతాధికారులు గ్రామపంచాయతీలకు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా భవనాలను స్వాధీనం చేసుకున్న గ్రామపంచాయతీ అధికారులు అటువైపు చూసిన దాఖలాలు లేవు. ఫలితంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారగా నిర్మాణ పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది.

కొద్దిపాటి నిధులు కేటాయిస్తే..

ప్రస్తుతం కొమ్ముగూడెం కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, వంట గది నిర్మిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. సుభాష్‌నగర్‌లో మాత్రం నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండిపోయింది. నిధులు ఖర్చు అయ్యాయే తప్ప కనీసం ఒక రూపం కూడా అందిపుచ్చుకోలేకపోయింది. ప్రస్తుతం కమ్యూనిటీ హాల్ పరిపూర్ణత సంతరించుకునేందుకు మందుభాగం ఫినిషింగ్ చేయడం, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట గది, ప్రహరీ నిర్మాణం వంటి పనులు చేయాల్సి ఉంది. వాటిలో తాగునీరు, వంట గది, విద్యుత్ వంటి సౌకర్యాలను గ్రామపంచాయతీలు తక్కువ ఖర్చుతో పూర్తి చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రణాళిక కూడా రూపొందించలేకపోయాయి. ఇక పంచాయతీకి సీసీ రోడ్లు వేయాలన్న ఉత్సాహం మినహా కమ్యూనిటీ హాల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకోవాలన్న ఆలోచన చేయకపోవడం విచారకరం. ప్రస్తుతం ఆదాయం లేక కునారిల్లుతున్న గ్రామపంచాయతీలు ఇలాంటి అవకాశాన్ని అందిపుచ్చుకుని కొద్దిపాటి పెట్టుబడితో సౌకర్యాలు సమకూర్చి భవిష్యత్‌లో పెద్దమొత్తంలో ఆదాయం పొందే అవకాశాన్ని చేజేతులా దూరం చేసుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు.

నిధుల కొరతతోనే జాప్యం



కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులు నూరు శాతం పూర్తి చేసి సౌకర్యాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొస్తాం. దీని కోసం అవసరమైన నిధులు అందుబాటులో లేకపోవడం వల్లే జాప్యం జరుగుతోంది. సుభాష్‌నగర్‌లో మరుగుదొడ్లు నిర్మించాం. త్వరలోనే ఒక్కొక్కటిగా పూర్తి చేసేందుకు కృషి చేసి కమ్యూనిటీ హాళ్ల ద్వారా గ్రామపంచాయతీ ఆదాయం పెంచుకుంటాం.

–చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు మండలం

విద్యాభివృద్ధికి కలామ్ ఎనలేని కృషి


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీ తదితరులు


పాల్వంచ: మొక్క నాటుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు

ఇల్లెందు: భారత తొలి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలామ్ ఆజాద్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన అబుల్ కలామ్ ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవంలో ఆయన పాల్గొని కలామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. అబుల్ కలామ్ ఆజాద్ విద్యాభివృద్ధికి వేసిన బాటలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని తెలిపారు. ఇల్లెందులో నున్న మైనార్టీల కోసం స్కూల్, కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆ పక్కనే ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్‌లో తాను చదువుకున్న సమయాన ఇన్ని వసతులు లేవని గుర్తు చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణ, కౌన్సిలర్లు రవి, నవీన్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: భారత స్వాతంత్య్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. సోమవారం ఆజాద్ జయంతి సందర్భంగా పట్టణంలోని కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన మొక్కలు నాటి.. దాతలు విరాళం ఇచ్చిన పాఠశాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.మాధవరావు, మచ్చా శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మంగీలాల్, ఎం.జ్యోతిరాణి, కార్తీక్, పద్మ, నీరజ, షారోన్, సరోజ, పార్వతి పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా చేపట్టాలి

ఇల్లెందురూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తప్పులు లేకుండా చేపట్టాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన సర్వే తీరును పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. పలు అంశాలపై వారు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేశారు.


ఇల్లెందురూరల్: సుదిమళ్లలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: మండలంలోని 36 గ్రామ పంచాయతీల పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వేగంగా కొనసాగుతోంది. మండలంలో 86 ఎన్యూమరేషన్ బ్లాక్‌లలో 86 మంది ఎన్యూమరేటర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లు 65 గ్రామాల్లో ఇప్పటివరకు 1,677 కుటుంబాలను సర్వే చేసినట్లు సర్వే పర్యవేక్షులు ఎంపీఓ బి.నారాయణ సోమవారం తెలిపారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జూలూరుపాడు మండల వ్యాప్తంగా కొనసాగుతోంది. మండలవ్యాప్తంగా 76 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు జూలూరుపాడు తహసీల్దార్ స్వాతిబిందు పేర్కొన్నారు. మొదటి రోజు 384 కుటుంబాలు, రెండో రోజు 692, మూడో రోజు 727 కుటుంబాలు.. మొత్తం 1,803 కుటుంబాలను సర్వే చేశారని తహసీల్దార్ వెల్లడించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా..


ధర్నా చేస్తున్న ఏజెన్సీ గౌడ కులస్తులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏజెన్సీ గౌడ కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏజెన్సీ గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏజెన్సీ గౌడలకు ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేశారని, ఇప్పుడు మైదాన ప్రాంతంలో ఇస్తున్న బీసీ-బీ సర్టిఫికెట్లను ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నరాటి ప్రసాద్, కాసుల శ్రీనివాస్, రాజుగౌడ్, రావుల సోమయ్య, కొండెం వెంకన్న, బొర్రా వెంకటేశ్వర్లు, రేసు ఎల్లయ్య, ఉదయ్, వెంకన్న, రాంబాబు, శ్రీను, పుల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

టేకులపల్లి: విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏజెన్సీ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు మాలోత్ అశోక్‌బాబు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడారు. దేశంలో 6 నుంచి 14 ఏళ్ల వయసు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడమే విద్యా హక్కు చట్టం ముఖ్య ఉద్దేశమని, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇది అమలు కావడం లేదన్నారు. బట్టు అరుణ్, భూక్యా రవి, బానోత్ వేణుగోపాల్, అంగోత్ రతన్‌లాల్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు


వరి పంటను కోస్తున్న హార్వెస్టర్

పాల్వంచరూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో రెండు రోజులుగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభంలో వ్యవసాయ బావులు, బోర్ల కింద ముందుగా వరినార్లు పోసిన రైతులు ఐదు నెలల కిందట నాట్లు వేశారు. ఆ వరి పంట కోత దశకు రావడంతో రైతులు హార్వెస్టర్లతో కోతలు మొదలు పెట్టారు. మండలంలో వానాకాలంలో 6,715 ఎకరాల్లో వరిసాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో వరినాట్లు ఆలస్యంగా వేసినప్పటికీ కురిసిన భారీ వర్షాలకు 36 గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఆయకట్టులో సాగుచేసిన పంటలకు సరిపడా సాగునీరు అందింది. ఈ సారి మద్దతు ధర క్వింటాకు రూ.2,320కి తోడు ప్రభుత్వం సన్నరకాలకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. వరి కోత యంత్రాలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి అద్దెలకు తీసుకొచ్చి వరి కోతలు చేపట్టారు. రైతుల నుంచి వరికోత మిషన్లకు డిమాండ్ పెరగడంతో ఒక్క ఎకరం రూ.3,500 నుంచి రూ.4,000 వేల చొప్పున కిరాయి తీసుకుంటున్నారు. హార్వెస్టర్లు టైర్లతో నడిచేవాటికి ఒక రేటు, చైన్ సిస్టంతో నడిచే వాటికి మరో రేటు చొప్పున యజమానులు వసూలు చేస్తున్నారు.

కూలీలకు ఉపాధి కరువు..

రైతులు హార్వెస్టర్ల వైపు మొగ్గు చూపడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కరవువైంది. ఒక ఎకరం వరిపొలం కూలీల ద్వారా కోయిస్తే రూ.15 వేలు ఖర్చు వస్తుందని, తర్వాత కూడా కోత కోసిన వడ్లు నాలుగైదు రోజులు పొలంలోనే ఉంటాయి. కోసిన తర్వాత కుప్పలు వేసి తర్వాత కొట్టించాల్సి వస్తుంది. ఈ పద్ధతిలో డబ్బులు అధికంతో పాటు ఎక్కువ రోజులు సమయం పడుతుంది. అదే యంత్రాల ద్వారా వరిని కోయిస్తే గంటలోనే పొలం నుంచి ఇంటికి ధాన్యాన్ని చేర్చుకునే అవకాశం ఉంది.

సీఎల్స్ మంజూరు చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కొత్తగా నియమితులైన జూనియర్ అసిస్టెంట్లకు క్యాజువల్ లీవ్‌లు (సీఎల్స్) మంజూరు చేయాలని సోమవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీఎల్‌లు లేక వారు ఇబ్బంది పడుతున్నారని, ఈ ఏడాదైన సీఎల్‌లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో త్యాగరాజన్, ఆల్బర్ట్, ఎండీ రజాక్, పీతాంబరం, అభిషేక్, సురేందర్, కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ


కొత్తగూడెంఅర్బన్: గణేశ్‌టెంపుల్‌లో జ్యోతిర్లింగార్చన


జూలూరుపాడు: అభిషేకం చేస్తున్న పూజారి, భక్తులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీవిజయవిఘ్నేశ్వరస్వామి ఆలయం (గణేశ్ టెంపుల్), రైటర్‌బస్తీలోని త్రిమాత ఆలయంలో నీలకంఠేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. గణేశ్ టెంపుల్‌లో జ్యోతిర్లింగార్చనలో భక్తులు ప్రమిదలు వెలిగించారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: ఆలయాల్లో కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి దేవస్థానం, కాకర్ల శ్రీసంతాన వేణుగోపాల స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు దీపాలు వెలిగించారు. అభిషేకాలు చేశారు.

నాయీబ్రాహ్మణుల వనసమారాధన

జూలూరుపాడు: మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణుల వనసమారాధనను సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండలవ్యాప్తంగా ఉన్న నాయీబ్రాహ్మణులు హాజరై సహపంక్తి భోజనాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా చాలామంది ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత నాయీబ్రాహ్మణులంతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కడియాల సత్యనారాయణ, కడియాల శ్రీను, పెద్దవరపు కృష్ణార్జున్‌రావు, మాదుగుల నాగరాజు, కుదురుపాక నిర్మల, కడియాల పుల్లయ్య, వల్లోజి రమేశ్, కడియాల నాగేశ్వరరావు, కడియాల బుచ్చిబాబు, నరేశ్, హరీశ్, మాదుగుల నరేశ్, కడియాల ప్రేమ్‌కుమార్, శ్రీనివాసరావు, శేషాద్రి మధు, వల్లోజి నాగరాజు, సైదులు పాల్గొన్నారు.


వనసమారాధనలో పూజలు చేస్తున్న దృశ్యం

వ్యాపారులు లైసెన్సు తీసుకోవాలి


మాట్లాడుతున్న బానోత్ రాంబాబు

టేకులపల్లి: మండలంలో పత్తి తదితర పంటలు కొనుగోలు చేసే వ్యాపారులంతా తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో టేకులపల్లి మండల వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండా పత్తి చిల్లర కొంటర్లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సులకు సంబంధించి నియమ నిబంధనలు మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిజ్జ వెంకటేశ్వర్లు, భూక్య శివలాల్, వి.సుచిత్ర, ఇ.నరేశ్ కుమార్, జి.రంజిత్, బి.రమేశ్, చందర్ పాల్గొన్నారు.

వందేళ్ల వేడుకలు నిర్వహించండి

ఇల్లెందు: కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) ఆవిర్భవించి వంద ఏళ్లు నిండుతున్న సందర్భంగా వాడవాడలా వేడుకలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సారయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందులోని విఠల్‌రావుభవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల పక్షాన ఎర్రజెండా నిలిచిందని, ఈ వందేళ్ల కాలంలో అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందని తెలిపారు. సమావేశంలో దేవరకొండ శంకర్, ఎండీ నజీర్‌అహ్మద్, బాస శ్రీనివాస్, బంధం నాగయ్య, దాసరి రాజారాం, కుమ్మరి రవీందర్, సుందర్, కొమరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.సారయ్య

ఇల్లెందు ఏరియా ఓఎస్డీగా కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా నూతన ఓఎస్డీగా జీఎం ఈసం కృష్ణయ్య బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జీఎం కార్యాలయంలో తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించి అధికారులు, ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. ఆయా విభాగాల అధికారులతో ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఏజీఎం (ఐఈ) గిరిధర్‌రావు, నరసింహారావు, కృష్ణమోహన్, గోవిందరావు, రామస్వామి, జీవీ మోహన్‌రావు, బాలాజీనాయుడు, రవికుమార్, పూర్ణచందర్, నాగరాజునాయక్, మహేశ్, దిలీప్‌కుమార్, అంజిరెడ్డి, సారయ్య, నజీర్ అహ్మద్, రాజారాం, యాదగిరి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.


కృష్ణయ్యను సన్మానిస్తున్న జీఎం జాన్‌ఆనంద్

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలి


పీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జూలూరుపాడు: స్థానిక పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల పేద, దళిత, గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.